క్లుప్తంగా

గిరిజనబంధు ప్రకటించాలి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: అసెంబ్లీలో గిరిజన బంధు ప్రకటించాలని లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్‌రాంనాయక్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఫూల్‌సింగ్ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్ కోరారు. మంత్రి హరీశ్‌రావును బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని వారు కోరారు.

ఘనంగా మడివళయ్య మాచిదేవా జయంతి



జయంతిలో పాల్గొన్న ప్రజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో బుధవారం మడివళయ్య మాచిదేవా జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో ఆయన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, మల్లికార్జున్, జైపాల్, అంజన్న, అనీల్, పండరినాథ్, అవినాష్, రాము, సత్యనారాయణ, రవీందర్, జర్నప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి

నారాయణఖేడ్: గంగాపూర్ సర్పంచ్ శ్రీనివాస్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు రూ.25వేలు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంజూరు చేయించారు. బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి తన నివాసంలో మంజూరైన చెక్కును సర్పంచ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు షాదుల్, సంగన్న, ముకుంద రెడ్డి, సాయిలు, మనోహర్, జీవన్, మోహన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వర్తించాలి

డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావు



సామాజిక తనిఖీలో పాల్గొన్న శ్రీనివాస్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావు అధికారులకు సూచించారు. గుమ్మడిదలలో రెండేళ్లుగా జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించడమే కాకుండా, ఎలాంటి అవినీతి జరగొద్దని అధికారులను హెచ్చరించారు.

ఇంటి స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు



అందోలులో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

జోగిపేట(అందోల్): సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందోల్–జోగిపేట మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వాలని, జాబితాను సిద్ధం చేయాలని వారు కోరారు. బుధవారం అందోల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, విఠల్, రామకృష్ణ, లలిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపు

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాల కల్పన
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



01పీటీసీ01 పాఠశాలలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కార్పొరేట్ విద్యను అందించడంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన మన ఊరు మనబడి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.51 లక్షలతో పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన విద్యారంగం సీఎం కేసీఆర్ నాయకత్వంలో జీవం పోసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, సర్పంచ్ బాలమణి శ్రీశైలం, ఎంపీటీసీలు శ్రీశైలం, అంజిరెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో బన్సీలాల్, డీఈ సురేష్, మండల విద్యాశాఖ అధికారి రాథోడ్, బీఆర్‌ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మౌలికవసతుల కల్పనే లక్ష్యం



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. హత్నూరలోని బోర్పట్లలో అరబిందో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.90లక్షలతో నిర్మాణం చేసిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే మదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా మన ఊరు మనబడిలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ వీరస్వామి, జెడ్పీటీసీ ఆంజనేయులు పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, నర్సాపూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ అశోక్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషోర్ రాజేష్, ఆగమయ్య పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మేళసంగ్యం జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, ఎంపీడీఓ అంజలి దేవి పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యాబోధన అందించడం ద్వారా విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. నాగులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.17.87లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల భవిషత్తు కోసమే ప్రభుత్వం మన ఊరు మనబడి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పత్రి క్రిష్ణవేణి, జెడ్పీటీసీ అపర్ణ, సర్పంచ్ నారాయణగౌడ్, వరము చైర్మెన్ వీరారెడ్డి, ఎంపీడీఓ జగదీశ్వర్, నాయకులు బస్వరాజ్, నర్సింలు, రాజేశ్వర్‌గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

పాఠశాల ప్రారంభం



ప్రారంభిస్తున్న మంజూశ్రీ, ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: మన ఊరు–మన బడి క్రింద రంజోల్‌లో రూ.40.80 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, జిల్లా పరిషత్ సీఓ ఎల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మంకాల్ సుభాష్, మోహినోద్దీన్, వైజ్యనాథ్ అధికారులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, సీఓ తదితరులు పాఠశాలలో కలియదిరిగారు. క్లాస్ రూంలోని బెంచీలో కూర్చున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.

ప్రతీ ఇంటికి రక్షిత నీటిని అందిస్తాం



మంచినీటి నల్లాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్‌లోని శ్రీ షిరిడి సాయి కాలనీలో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్లను ఆయన ప్రారంభించారు. అనంతరం జవహర్ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.9లక్షలతో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. కృష్ణారెడ్డిపేటలో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, సర్పంచ్ నితీశా శ్రీకాంత్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస రావు, పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల వీరారెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించనున్న పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దేవాలయాలు అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, నాయకులు హుస్సేన్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి చర్యలు

జిన్నారంలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగ శివాలయ నిర్మాణానికి గ్రామస్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశంగౌడ్, ఉపసర్పంచ్ సంజీవ, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌చారి, శ్రీధర్‌గౌడ్, పుట్టి భాస్కర్, బ్రహ్మేందర్, మహేందర్‌గౌడ్, గాండ్ల శ్రీనివాస్, శివస్వాములు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దేవాలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గ్రామస్తులు కోరారు.

ఘనంగా ఆదినారాయణ స్వామి రథోత్సవం

జిన్నారం(పటాన్‌చెరు): కొడకంచి గ్రామంలో ఆదినారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎం దామోదర రాజన ర్సింహా, జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు, కొడకంచి సర్పంచ్ శివరాజ్, బీజేపీ నాయకులు గడీల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు. దేవాలయ ట్రస్టీ చైర్మన్ రామాజీరావు ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డి



ఎమ్మెల్యే జయప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): అంగన్‌వాడీ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో పట్టణంలోని ఐబీఅతిథి గృహానికి వచ్చిన ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. నేటికీ వారి సమస్యలు పరిష్కరించే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు అసెంబ్లీలో ప్రభుత్వంపై వత్తిడి తీసుకవస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సంగీత, ప్రవీణ, శశికళ తదితరలు పాల్గొన్నారు.

ఎవరి అనుమతితో స్టోన్ క్రషర్లకు అప్పగించారు

బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



శ్రీకాంత్ గౌడ్, రెవెన్యూ అధికారికి వివరిస్తున్న రైతులు

పటాన్‌చెరు టౌన్: లక్డారంలోని సర్వే నెంబర్ 747లో సాగు భూమిని ఎవరి అనుమతితో క్రషర్లకు అప్పగించారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ ప్రశ్నించారు. బుధవారం లక్డారం గ్రామంలో సర్వే నెంబర్ 747లోని భూమిని రెవెన్యూ శాఖ ఆర్‌ఐ ఖాజా, రైతులతో సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ...అక్రమంగా రైతుల పొలాల్లోకి చొరబడి ఆక్రమించే ప్రయత్నం చేస్తూ, సాగు కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న వరి మళ్లను చెడగొట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పట్టేదారులకు భూమి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

చెట్టును ఢీ కొన్న టిప్పర్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: టిప్పర్ లారీ అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎంజీ రోడ్డుపక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ శాఖ, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సమాచారం చేరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే రోడ్ల పక్కన ఏపుగా పెరిగే చెట్లను ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు కొమ్మలను కత్తిరించాలన్నారు.

వీల్‌చైర్ అందజేత:

బీహార్ నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన కృష్ణ పటాన్‌చెరులో ఉంటూ సికింద్రాబాద్‌లోని ఓ కెమికల్ కంపెనీలో పనిచేస్తూ ఇటివలే ప్రమాదానికి గురైన ఘటనలో కాలు విరిగింది. దీంతో వైద్యులు నడవడం సాధ్యం కాదని చెప్పారు. స్థానికుల ద్వార సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్ బుధవారం బాధితున్ని పరామర్శించారు. అనంతరం వీల్ చైర్‌ను అందించారు.

సంక్షిప్త వార్తలు

◆ అంత్యక్రియలకు ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): కానుకుంట గ్రామానికి చెందిన షర్ఫుద్దీన్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

◆ ప్రజాస్వామ్యం బతకాలంటే పత్రికలు ఉండాలి

జోగిపేట(అందోల్): ప్రజాస్వామ్యం బతకాలంటే పత్రికలు ఉండాల్సిందేనని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. బుధవారం పోతులబొగుడలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు గాజుల పవన్ కుమార్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పత్రికలు నిష్పక్ష పాతంగా ఉన్నది ఉన్నట్లుగా రాస్తేనే ప్రజాస్వామ్య విలువలు బతుకుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ బాలయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ హెచ్.రామాగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజు, చైర్మన్ లింగాగౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ మాణిక్‌రెడ్డి, ఆత్మగౌరవ కమిటీ అధ్యక్షుడు వీరభద్రరావు, జర్నలిస్టు సంఘం నాయకులు ఎ.రాంబాబు, రాజశేఖర్ కులకర్ణి, తాలుకా యూనియన్ అధ్యక్షుడు పవన్‌కుమార్, భగత్, రాజు, సంతోష్, పాల్గొన్నారు.

◆ 33 మందికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 33 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు.

◆ కిచ్చినపల్లి హెచ్‌ఎంకు సన్మానం



జోగిపేట(అందోల్): ఎఫ్‌ఎల్‌ఎన్ తొలి మెట్టు మండల స్థాయి బోధనాభ్యాససామాగ్రి గణిత మేళాలో ద్వితీయ స్థానం కిచ్చన్న పల్లి పాఠశాల కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ వహీద్‌ను శాలువా కప్పి బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ కే. యాదాగౌడ్, పంచాయతీ కార్యదర్శి మీనా, డీలర్ శ్రీశైలం, మాజీ చైర్మన్ సంతోష్ కుమార్, కోఆప్షన్ నెంబర్ దుర్గయ్య, మాజీ వార్డు మెంబర్లు వెంకయ్య, మానయ్య, యువకులు ప్రవీణ్ కుమార్, రాజేంద్రప్రసాద్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మ్యాన్‌హోల్‌తో జర భద్రం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో మ్యాన్‌హోల్‌లు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల సిమెంట్ రోడ్లపై ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్‌లు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. వాహనాలు ఆ మ్యాన్ హోల్‌పై నుంచి వెళితే కుంగుతున్నాయి. దీంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురై గాయాలపాలవుతున్నారు. అమీన్‌పూర్ టైలర్స్ కాలనీ వెళ్లే దారిలో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌ను స్థానికులు గుర్తించి దానికి అడ్డుగా కర్రలు, గొడుగులను ఉంచారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి



కౌన్సిలర్ చిట్టిబాబును సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

జోగిపేట(అందోల్): ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని అందోలు–జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ ఎ.చిట్టిబాబు అన్నారు. రాంసానిపల్లిలోని శివాలయ పునఃనిర్మాణానికి రూ.లక్ష చెక్కును ఆయన విరాళంగా అందజేశారు. బుధవారం రాంసానిపల్లికి వచ్చిన సందర్భంగా శివాలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణానికి కమిటీ నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కౌన్సిలర్ చిట్టిబాబు దేవాలయ పునఃనిర్మాణానికి తనవంతు సాయం అందించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

టీఎల్‌ఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

సదాశివపేట(సంగారెడ్డి): భవిత జూనియర్ కళాశాలలో బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు హైకోర్టు న్యాయవాది కె. దయాకర్‌రెడ్డి తెలంగాణ లెక్చరర్స్ ఫోరం కేలండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలరాజు, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, రాజు, టీఎల్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడు పర్వేజ్, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవి, భవిత కళాశాల అధ్యాపకులు మల్లేశం, నెల్సన్, బీజేపీ నాయకులు గోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హరికాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

రుక్మిణీ పాండురంగడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని పండరీపూర్‌లో నిర్వహిస్తున్న మాఘమాస ఉత్సవాల్లో భాగంగా రుక్మిణీపాండురంగడిని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. అక్కడ దాతల సహకారంతో నిర్మించిన కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ ఆశ్రమం, ధర్మసత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆశ్రమ ప్రాంగణంలో ఖేడ్ సామాజిక కార్యకర్త, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కరణ్ గజేంద్ర భారతి మహారాజ్, అవధూత్ మహారాజ్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆత్మ కమిటీ చైర్మన్ రాంసింగ్, పేట, సిర్గాపూర్ ఎంపీపీలు జంగం శ్రీనివాస్, సుశీల, ఖేడ్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పరమేశ్వర్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మండల రైబస అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, కృష్ణాపూర్ సర్పంచ్ కృష్ణారెడ్డి, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మహా పడిపూజ



మహాపడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి

ఝరాసంగం(జహీరాబాద్): శివదీక్షాపరులు మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిలపల్లి గ్రామంలో గురుస్వామి నాగిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో పూజలు చేశారు. శివస్వాములు ఆటపాటలతో భజనలు చేస్తూ, నృత్యాలు చేశారు.

జహీరాబాద్: జహీరాబాద్‌లో రంజోల్‌లోని మాచదేవుని విగ్రహానికి ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వై.నరోత్తం, సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బక్కన్న, మల్లేష్, వెంకట్‌రాం, వెంకట్, చంద్రశేఖర్, కిష్టన్న, వెంకటేశం, శ్రీనివాస్, రాజ్‌కుమార్, పీఠాధిపతి రాచయ్యస్వామి, బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌గుప్త, బీఆర్‌ఎస్ నాయకుడు రవికిరణ్, మద్దె రాంరెడ్డి, భాస్కర్, భీమాశంకర్ పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని శివాజీ విగ్రహం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు.

'వేతన జీవులను వంచించిన కేంద్ర బడ్జెట్'



సాయిలు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ వేతన జీవులను వంచించే విధంగా ఉందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాయిలు తెలిపారు. బుధవారం సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదన్నారు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయటానికే కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు అర్థమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సింహాచలం, జగన్మోహన్, జ్యోతి, విజయానంద్, బాలకష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

పన్ను మినహాయింపులో కార్మికుల ఆశలపై నీళ్లు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పన్ను మినహాయింపులో కనీసం రూ.9లక్షల వరకు ఇస్తారని అనుకున్న కార్మికుల ఆశలపై నీళ్ళు చల్లిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి అన్నారు. పన్ను మినహాయింపు రెండున్నర లక్షల నుంచి మూడు లక్షలేనన్నారు. రూ.50 వేలు పెంచారని, మూడు లక్షల వరకూ మినహాయింపు ఇచ్చి, మూడు నుంచి ఐదు లక్షల వరకూ ఐదు శాతం పన్నులు విధించడం వల్ల కార్మికులకు ఒరిగిందేమిలేదన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

న్యాల్‌కల్(జహీరాబాద్): గణేష్‌పూర్, మిర్జాపూర్(బి), హుస్సెళ్లి, న్యాల్‌కల్ తదితర గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలను జెడ్పీసీఈఓ ఎల్లయ్య, మండల ప్రత్యేక అధికారి రాఘురారావు, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డిలు బుధవారం సందర్శించారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్



జయరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి



మాణిక్యం, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై భారాలు వేసే విధంగా ఉందని, ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వాటాను గణనీయంగా తగ్గించారు. రాష్ట్రాల నుంచి వచ్చే పన్నుల్లో కేంద్రం 42శాతం ఇవ్వగా, ప్రస్తుతం 41 శాతానికి తగ్గించింది. ఆహార సబ్సిడీని గత సంవత్సరంపై 50శాతం తగ్గించారు. గ్యాస్‌పై సబ్సిడీని తగ్గించారు. ఇది పూర్తిగా సంపన్నుల మేలు కోరే విధంగా రూపొందించిన బడ్జెట్‌లా ఉందన్నారు. ఉపాధి హామీ నిధులు తగ్గింపునకు కుట్ర: మాణిక్యం, కేవీపీఎస్ ఉపాధ్యక్షుడు సంక్షేమ పథకాలు ఎత్తివేయడం, ఉపాధి హామీ నిధులు భారీగా తగ్గిస్తూ జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించడంలో దళితులకు బీజేపీ ప్రభుత్వం ద్రోహం చేసింది. దేశంలో దళితులు 20శాతం ఉండగా, 16 శాతం నిధులు మాత్రమే కేటాయించింది. గత బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ.89,400కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.60,000కోట్లకు తగ్గించారు.

ఉపాధి హామీ నిధులు తగ్గించిన కేంద్రం

జహీరాబాద్ టౌన్: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులను తగ్గించిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంచందర్ ఆరోపించారు. గత బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.89 వేల కోట్లను కేటాయించారు. ప్రస్తుతం రూ.60వేల కోట్లకు తగ్గించిందన్నారు. 15 కోట్ల మంది వ్యవసాయ కూలీలు ఉండగా, బడ్జెట్ తగ్గించడంతో వారి జీవితాలపై ప్రభావం పడుతుందన్నారు. గిట్టుబాటు ధర గురించి చట్టం చేస్తామన్న కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు.